క్లుప్తంగా

మంత్రిని కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అంజయ్య

భువనగిరి : రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్ రెడ్డిని శనివారం భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య కలిశారు. ఈ సందర్భంగా భువనగిరి జిల్లా కోర్టుకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాటు పట్టణంలోని సింగన్నగూడెం చౌరస్తా వద్ద ఉన్న అంబేడ్కర్ భవనం నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావుల రవీందర్‌రెడ్డి ఉన్నారు

ఆటో కార్మికుల నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

యాదగిరిగుట్ట: తమ ఆటోలను యాదాద్రి కొండపైకి అనుమతించాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణంలో శనివారం ఆటో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆటో కార్మికుల జేఏసీ నాయకులు మాట్లాడుతూ యాదాద్రి ప్రధానాలయ పునః ప్రారంభమైన తరువాత సుమారు 300 ఆటోలను కొండపైకి ఆలయాధికారులు, ప్రభుత్వం నడిపించకుండా బంద్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆటోలను కొండపైకి అనుమతించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

గుండాల : మండలంలోని బండకొత్తపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బుర్ర యాదయ్య ప్రమాదవశాత్తు శుక్రవారం తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని బీజేపీ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ గౌడ్ పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట సంగు సాయి, సంగు ఉపేందర్, మహేష్, ప్రవీణ్, కిరణ్ ఉన్నారు.

ఎలక్ట్రీషియన్ మృతికి సంతాపం

రామన్నపేట: మండలకేంద్రానికి చెందిన సీనియర్ ఎలక్ట్రీషియన్ మహ్మద్‌అలీ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. స్థానిక ఎలక్ట్రీషియన్లు శనివారం ఆయన మృతదేహంను సందర్శించి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఏటెల్లి శ్రీనివాస్, ఎండీ యూసుఫ్, జావిద్, లింగారావు, జమీరుద్దిన్, ఖదీర్‌పాష, అబ్దుల్ వహీద్, కల్లూరి నాగేష్, సోహెల్, కసిరెడ్డి ఇంద్రారెడ్డి, ఉన్నారు.

'నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు'

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ ఆరోపించారు. శనివారం భువనగిరిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించపోవడంతో పైపులు వేస్తున్న దశలోనే పగిలిపోతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బబ్లు, నాగరాజు, భరత శివకుమార్, నాగేందర్, సిద్దార్థ ఉన్నారు.

దోషులను శిక్షించాలి

భువనగిరిటౌన్ : మణిపూర్ రాష్ట్ర మహిళలపై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మున్సి పల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పిన్నింటి స్టాన్లీ, రాహుల్, గిరిష్, బలరాం, ఉపేందర్, సాయికుమార్ ఉన్నారు.

పెంచిన పెన్షన్ వెంటనే విడుదల చేయాలి

భువనగిరిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెంచిన 1000 రూపాయల పెన్షన్ వెంటనే అమలు చేస్తూ జీవో జారీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 9న మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ వికలాంగుల పెన్షన్ మరో రూ.1000 పెంచుతున్నామని ప్రకటించారని తెలిపారు. రాష్ట్రంలో ఇతర తరగతుల ప్రజలకు హామీలు ఇచ్చిన వెంటనే అమలుచేయడానికి జీవోలు జారీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు పెంచిన పెన్షన్ అమలుకు ఎందుకు జీఓ విడుదల చేయలేదని ప్రశ్నించారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి స్వామి, మహిళ విభాగం జిల్లా కన్వీనర్ కొత్త లలిత ఉన్నారు.

మూతబడే స్థితిలో...

- లక్ష్మాపురం పాఠశాలలో ఏటేటా తగ్గుతున్న విద్యార్థుల నమోదు
- ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నా ప్రైవేట్ స్కూళ్లవైపు మొగ్గు
- పరిస్థితి ఇలానే కొనసాగితే పాఠశాల భవిష్యత్ ప్రశ్నార్థకం



రామన్నపేట మండలం లక్ష్మాపురం పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

రామన్నపేట : ప్రైవేటు విద్యాసంస్థల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపడం, మోడల్‌స్కూళ్లు, గురుకులాల ఏర్పాటు, జీవనోపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లడం వంటి కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల నమోదుశాతం ప్రతీయేటా పడిపోతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని లక్ష్మాపురం ఉన్నత పాఠశాల ఇందుకు నిదర్శనం. మండలకేంద్రానికి 10కిలోమీటర్ల దూరంలో లక్ష్మాపురం గ్రామం ఉన్నది. గ్రామజనాభా 2200 వరకు ఉంటుంది. రెండు గ్రామాల మధ్య ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. లక్ష్మాపురంలోని యూపీఎస్ 2002–03 విద్యా సంవత్సరంలో హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయింది. సమీపంలోని శోభనాద్రిపురం గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తయిన విద్యార్థులు కూడా లక్ష్మాపురం ఉన్నత పాఠశాలలో చేరేవారు. ప్రారంభంలో 200 వరకు విద్యార్థులతో పాఠశాల కళకళలాడింది.

విద్యార్థులు లేక..

లక్ష్మాపురం ఉన్నతపాఠశాలలో కొన్నేళ్లుగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ క్రమేపి పడిపోతుంది. విద్యార్థులు లేక పాఠశాల కళతప్పింది. ప్రస్తుతం పాఠశాలలో కేవలం పదిహేడు మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. దీంతో పాఠశాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. రెండు గ్రామాల నుండి ఇరవై మంది విద్యార్థులు మండలకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు. ప్రభుత్వ పాఠశాల మీద ఆధారపడిన పేద విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో ఏ క్షణంలోనైనా పాఠశాలను మూసివేసే ప్రమాదం లేకపోలేదు. పాఠశాలలో రూ. 30లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌ఎంఎస్‌ఏ భవనం నిరుపయోగంగా ఉన్నది. ఒక గదిలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, మైదానంలో విలేజ్ నర్సరీని ఏర్పాటు చేశారు.

ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతోంది



"విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రతియేటా తగ్గుతోంది. ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి ఉపాధ్యాయులు ప్రతీ ఇంటికి వెళ్లడం జరిగింది. గురుకులాలు, ప్రైవేటు పాఠశాలల్లో చేరిన మరో పదిమంది విద్యార్థులు తిరిగి పాఠశాలలో చేరడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ మంది పిల్లలు ఉన్నా మెరుగైన విద్య అందిస్తున్నాం.

– ఎస్.దుర్గయ్య, ప్రధానోపాధ్యాయుడు, లక్ష్మాపురం

పాఠశాలను నిలబెట్టడానికి కృషి



"పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. బడిబాట కార్యక్రమంలో ఇళ్లిల్లూ తిరిగి అవగాహన పరిచాం. గ్రామంలో చాలా కుటుంబాలు వలస వెళ్లడం, ఉన్నవారి పిల్లలు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం, ప్రైవేటు హాస్టళ్లలో చేరడం విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఒక కారణం. పాఠశాలను నిలబెట్టడానికి మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

–ఉప్పు ప్రకాష్ సర్పంచ్ లక్ష్మాపురం

● మత్తడి దూకుతున్న ఊరచెరువు



మోటకొండూర్: ఇటీవల కురిసిన వర్షాలకు మోటకొండూర్ ఊర చెరువు శనివారం మత్తడి దుంకుతుంది. దీంతో గ్రామస్తులు గ్రామసర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత ఆధ్వర్యంలో బోనం పెట్టి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. కాగా అలుగు పోసే దృశ్యాన్ని చూడటానికి గ్రామస్తులు పెద్దెత్తున వచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుగ్గ భాగ్యలక్ష్మీభాస్కర్, వంగాల స్వరూప, కాంబోజు నాగరాజు, సత్తమ్మ, జహంగీర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

గీత, తాటి వనాలను కాపాడుకోవాలి



గీత, తాటి వనాలను పరిశీలిస్తున్న పల్లె రవికుమార్

చౌటుప్పల్ : గ్రామాల్లోని గీత, తాటి, ఖర్జూర వనాలను కాపాడుకోవాలని రాష్ట్ర గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని జైకేసారం గ్రామంలోని గీత, తాటి వనాన్ని శనివారం ఆయన సందర్శించారు. మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరితహారంలో భాగంగా మరిన్ని మొక్కలు నాటాలన్నారు. ఇప్పటికే ఉన్న ప్రతి మొక్కను సంరక్షించాలని తెలిపారు. సొసైటీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పల్లె మల్లయ్య, రాగీరు కిష్టయ్య, ఆకిటి నర్సింహ్మ, పల్లె మధుకృష్ణ, యాదయ్య, జంగయ్య, కృష్ణ, ప్రవీణ్‌కుమార్, సైదులు, శివ, తదితరులు ఉన్నారు.

మహాకవి దాశరథికి ఘన నివాళి



భువనగిరి : నివాళులర్పిస్తున్న అమరేందర్‌గౌడ్

భువనగిరి : మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా డాక్టర్ దాశరథి 99వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

భువనగిరిటౌన్ : మహాకవి దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అమరేందర్ గౌడ్ దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, జడల యాషీల్ గౌడ్, తాడూరి కిష్టయ్య, ఆనందం, సుధీర్, శ్రీనివాస్ కావ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ : కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను పట్టణ కేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ ఊడుగు మల్లేష్‌గౌడ్ దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సిలివేరు కృష్ణ, బొబ్బిళ్ల శ్రీనివాస్, ఎండి.ఇబ్రాహీం, సిబ్బంది అనిత, తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరులో..

మోత్కూరు : మహా కవి దాశరథి 99వ జయంతి వేడుకలను శనివారం మోత్కూరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఇన్‌ఛార్జి చిలుకమర్రి బాబుచారి దాశరథి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు బయ్యని రాజు, చేపూరి భిక్షం, దొంతోజు సోమలింగం, సజ్జనం పాండు, రాములు పాల్గొన్నారు.

ప్రజా భారతి ఆధ్వర్యంలో..

మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజా భారతి ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా భారతి ప్రధాన కార్యదర్శి గుమిడెల్లి వెంకన్న, కోశాధికారి గాదె వెంకటేశ్వర్లు, మనోహరాచారి, వారాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

28న దరఖాస్తు చేసుకోవాలి

ఆలేరురూరల్ : డ్రైవింగ్ లైసెన్స్‌లు లేనివారు ఈనెల 28న ఎస్‌బీఐ బ్యాంక్ దగ్గర మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న మేళాలో దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు పూల శ్రవణ్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ పంతం కృష్ణ, కుండె సంపత్, జూకంటి శ్రీకాంత్, పాల్గొన్నారు.

జిల్లా జాయింట్ కో–ఆర్డినేటర్‌గా నియామకం

చౌటుప్పల్ : కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా జాయింట్ కో–ఆర్డినేటర్‌గా పట్టణ కేంద్రానికి చెందిన వర్కాల రాము నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు గోద రాహుల్ శనివారం నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి రవీందర్, బోయ రామచంద్రం, ఎస్‌కె.జానిబాబు, శామకూర రాజయ్య, చెరుకు లింగస్వామి ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో ఇటీవల మృతిచెందిన బాతరాజు చంద్రయ్య కుటుంబానికి ధర్మోజిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొంతం భాస్కర్‌రెడ్డి ఇచ్చిన 10వేల రూపాయల నగదును గ్రామ మాజీ సర్పంచ్ సుర్వి నర్సింహ్మ గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో పందుల రాజేష్, దొనకొండ కృష్ణ, మట్టుపల్లి శ్రీశైలం ఉన్నారు.

అడ్డగూడూరు : మడంల పరిధిలోని జానకీపూరం గ్రామానికి చెందిన ఓర్సు వీరయ్య(59)అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ రూ.10 వేలను శనివారం గ్రామ సర్పంచ్ కొప్పుల మోహన్ రెడ్డి,బీఆర్‌ఎస్ నాయకుల చేతుల మీదుగా ఓర్సు వీరయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గొడిశాల సోమ రాములు, పాలబిందెల వెంకన్న, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరోపణలు అర్థరహితం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

ఆలేరురూరల్ : కొలనుపాక వాగుపై హైలెవ్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.50కోట్లు మంజూరు చేసి టెండర్లు ప్రక్రియ పూర్తి కావస్తున్నా కూడా కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు అర్థరహితంగా ఉన్నాయని ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం అన్నారు. శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక రాజకీయ లబ్ధికోసమే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ధర్నా చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులుగాని మల్లేష, పంతం కృష్ణ, కుండె సంపత్, దాసి సంతోష్, పత్తి వెంకటేష్, బేతిరాములు, నర్సింహులు, వెంకటేష్, జెల్లి నర్సింహులు, పూల శ్రవణ్, సంపత్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



మోటకొండూర్ : ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 17వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల ఎదుట కార్మికులు దీక్ష కొనసాగిస్తూనే ఉన్నారు. కొన్ని చోట్ల కార్మికులు మోకాళ్ల మీద కూర్చొని, ఒంటి కాలుపై నిల్చొని, భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలు, రాస్తారోకో చేశారు. మహిళా కార్మికులు బతుకమ్మ ఆడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తమ ఆందోళన పక్షం రోజులు దాటినా ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం నాయకులతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

భువనగిరిటౌన్ : పట్టణంలోని ఆజాద్ రోడ్డు వద్ద మురుగుకాలువ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎండీఏ నిధులతో అంతర్గత మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు.

పోటాపోటీగా డ్రైవింగ్ లైసెన్స్‌ల మేళా



దరఖాస్తులను స్వీకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వలిగొండ : మండల కేంద్రంలో రాజకీయ పార్టీల నాయకులు శనివారం పోటాపోటీగా డ్రైవింగ్ లైసెన్స్‌ల మేళా ఏర్పాటు చేశారు. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, కుంభం ప్రేమలత శ్రీనివాస్ రెడ్డి సాంఘిక సంక్షేమ సేవ సమితి ఆధ్వర్యంలో రెండవరోజు, స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పైళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి రోజు యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యువత మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, పల్లెర్ల సుధాకర్, రాజు, పాలకుర్ల వెంకటేష్, లింగ స్వామి, కొండూరు వెంకన్న, అయిటిపాముల ప్రభాకర్, భిక్షపతి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరిటౌన్ : డ్రైవింగ్ లైసెన్స్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కూర వెంకటేశం అన్నారు. శనివారం భువనగిరిలో డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులను స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సౌజన్యంతో యువతకు లైసెన్స్ ఇప్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మజహార్, పిట్టల బాలారజు, నిరంజన్ ఉన్నారు.

ఫ్రీ డ్రైవింగ్ లైసెన్స్ కేంద్రాల ప్రారంభం

భువనగిరి : భువనగిరి నియోజకవర్గంలోని యువత ఫ్రీ డ్రైవింగ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ కోల్పుల అమరేందర్‌లు అన్నారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు ఫారాలు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిశ్రమను ఎత్తివేయాలని అర్ధనగ్న ప్రదర్శన

బీబీనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామంలో తిరుమల ట్రేడింగ్ పరిశ్రమను ఎత్తివేయాలని కోరుతూ గ్రామస్తులు చేపడుతున్న నిరాహార దీక్షలో భాగంగా శనివారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో బుయ్యా కిషోర్, జక్కి నగేష్,కుమార్, సంతోస్ పాల్గొన్నారు.

తప్పులు దొర్లకుండా ఓటరు జాబితా రూపొందించాలి



వలిగొండ : మాట్లాడుతున్న ఆర్డీఓ అమరేందర్

బొమ్మలరామారం : బూత్ లెవల్ అధికారులు ఓటర్ జాబితాలో తప్పులు దొర్లకుండా రూపొందించాలని చౌటుప్పల్ ఆర్‌డీఓ ఉపేందర్ రెడ్డి అన్నారు.మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బూత్ లెవల్ అధికారులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటరుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మ సుందరి, డిప్యూటీ తహసీల్దారు చారి, ఎంఆర్ఐ వెంకట్ రెడ్డి, ఎంఎస్‌వో శ్రీనివాస్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వలిగొండ : రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బూత్ స్థాయి అధికారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి భువనగిరి ఆర్డీవో అమరేందర్ హాజరై మాట్లాడారు. బీఎల్వోలకు ఎన్నికల సంఘం రూపొందించిన యాప్ ఆన్‌లైన్‌లో నూతన ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసిల్దార్ గణేష్ నాయక్, సంజీవరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

యాదగిరిగుట్ట రూరల్: ఓటరు జాబితా సవరణపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుతూ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వీఆర్‌ఏలకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, మాస్టర్ ట్రినర్స్ ఉమా శంకర్, యస్.కృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్సింగరావు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డార్మిటరీ భవనాన్ని నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

భువనగిరి : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నూతన డార్మిటరీ భవనాన్ని నిర్మించాలని ఏబీవీపీ నల్లగొండ విభాగ్ కన్వీనర్ సుర్వి మణికంఠ అన్నారు. శనివారం పట్టణంలోని హన్మాన్‌వాడలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనాన్ని, శిథిలావ్యవస్థలో ఉన్న డార్మిటరీ భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. వెంటనే నూతన డార్మెంటరీ భవనాన్ని నిర్మించి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ రాం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంజయ్, సాయికిరణ్, వేణు, సాయికుమార్, సాయితేజ, మహేష్, జీవన్, విశాల్, వినయ్, యశ్వంత్ ఉన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన నాయకులు

పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పరిశీలించారు. అనంతరం శిథిలావ్యవస్థకు చేరుకున్న పాఠశాలలోని తరగతి గదులు, డార్మెంటరీ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రాంచంద్రయ్య, పీపుల్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు శివలింగం, నాయకులు పడిగెల ప్రదీప్, ఇటుకల దేవేందర్, శ్రవణ్,లింగస్వామిలు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లంల జంగయ్య

భువనగిరి : రాబోయే ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య అన్నారు. శనివారం పట్టణశివారులోని దీప్తి హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ నూతన కార్యవర్గం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడంతో పాటు అధికారంలోకి వచ్చే విధంగా చేసే బాధ్యత ఓటర్ల పై ఉందన్నారు. సమావేశంలో డీసీసీ కార్యదర్శి కోట పెద్ద స్వామి, చిక్కుల వెంకటేశం, శివానంద్, చుక్క స్వామి, ఓరుగంటి అంజనేయులు, సాయిరెడ్డి మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, విఠల్ వెంకటేష్, బోల్లేపల్లి అశోక్, రసూల్, లూర్దయ్య, ధనకోటి, పాండు, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

➡ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

వలిగొండ : దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి కోరారు. శనివారం మండలంలోని నాగారం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సురేందర్, కల్కూరి రాంచంద్రం, గరదాసు నర్సింహ, ధ్యానబోయిన యాదగిరి, వేముల లక్ష్మయ్య, వెంకటేశం, నర్సింహ, దశరథ, స్వామి పాల్గొన్నారు.

➡ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వినతి

చౌటుప్పల్ : చౌటుప్పల్–వలిగొండ ప్రధా న రహదారికి మరమ్మతులు చేయించాలని కోరు తూ డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ ఆధ్వర్యంలో డీఏవో శ్రీనివాస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.ఖయ్యూం, దేప రాజు, నాగరాజురెడ్డి, ఉన్నారు.

➡ యాదవులపై రాజకీయ కక్ష తగదు

ఆలేరురూరల్ : యాదవులపై బీర్ల ఐలయ్య కావాలనే రాజకీయ కక్ష చేస్తున్నాడని శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శిరమైన వెంకటేషయాదవ్ అన్నారు. శనివారం ఆలేరులో స్థానిక గెస్టహౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలేరు వైస్ ఎంపీపీ గాజుల లావణ్యవెంకటేష్‌యాదవ్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే కాంగ్రెస్ ఎంపీటీసీలతో అవిశ్వాస తీర్మానం పెట్టించడాన్ని వ్యతిరేకిస్తున్నామని మండిపడ్డారు.కార్యక్రమంలో నాయకులు అవిశెట్టి రమేష్‌యాదవ్, జక్కుల వెంకటేష్, కావటి స్వామి, శ్రీనివాస్, ఉప్పలయ్యపాల్గొన్నారు.

➡ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవా లయ పాలకవర్గం శనివారం ప్రమాణస్వీకారం చేసింది. చైర్మన్ సుంకరి సత్యనారాయణ ధర్మకర్తలుగా పల్లె రాజిరెడ్డి, ఎండబెట్ల మహేష్, ఎలువర్తి రమేష్, చిట్టంపల్లి వనజనరేందర్‌లు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలువర్తి యాదగిరి, ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్, ఉపసర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ, దొడి బాలరాజు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

➡ ఇంద్రపాలనగరం వాసికి చెన్నై ఐఐటీలో సీటు

రామన్నపేట : చెన్నై ఐఐటీలో ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన రుద్రాల యశ్వంత్‌మణి సీటు సాధించాడు. ఐఐటీ ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఎస్సీ కేటగిరీలో 610వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో సీటు సాధించిన యశ్వంత్‌మణిని మదర్‌థెరిసా స్కూల్ యాజమాన్యం శనివారం సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు జేఎస్ స్తోత్రమ్మ, కరస్పాండెంట్ జేఎస్ మార్టిన్, హెచ్‌ఎం ఫర్వీన్ సుల్తానా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

➡ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

మోటకొండూర్: మోటకొండూర్ మండలంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శనివారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సురపంగ శ్రీనివాస్, మానెగళ్ల విక్రమ్, చామల మల్లారెడ్డి, గుర్రాల నాగరాజు, సుదగాని నవీన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

➡ మణిపూర్ ఘటన దారుణమైన చర్య

అడ్డగూడూరు: మణిపూర్ గఘటన దారుణమైన చర్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ అన్నారు. శనివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు.

➡ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఆత్మకూరు(ఎం): మండలంలోని రహీంఖాన్‌పేటలో రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతా తెరిచే సందర్భంలో అందచేయాల్సిన పత్రాలపై. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహేష్, యుగంధర్, మాజీ సర్పంచ్ మల్లెల పర్వతాలు పాల్గొన్నారు.

➡ సబ్సిడీ లోను చెక్కు అందజేత

భువనగిరి : మైనార్టీ లోన్ స్కీం ద్వారా పట్టణంలోని 15వ వార్డుకు చెందిన రేష్మకు క్యాటరింగ్ వ్యాపారం నిమిత్తం మైనార్టీలోను ద్వారా మంజూరైన రూ. 2 లక్షల విలువ చేసే చెక్కును శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, మార్కెట్ కమిటి చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, నాయకులు ఎక్బాల్ చౌదరి, జంగయ్య ఉన్నారు.

➡ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

రాజాపేట: మండలంలోని పాముకుంట మదిర గ్రామం కాశగూడెం, సింగారం గ్రామాలకు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయ్యింది. కాగా శనివారం బీఆర్‌ఎస్ నాయకులు వారికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్ణాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగిర్తి రాజిరెడ్డి, సట్టు తిరుమలేష్, నాయకులు పాల్గొన్నారు.

➡ నిందితులను కఠినంగా శిక్షించాలి

భువనగిరి: మణిపూర్‌లో అదివాసి మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కాకుమారి డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళల పై సాగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా శనివారం మండలంలోని ముత్తిరెడ్డి గూడెం గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకురాలు కొండమడుగు కమలమ్మ, ఎల్లమ్మ, రాములమ్మ, మంగమ్మ, నరసమ్మ, బాలనర్సమ్మ, యశోద, అండమ్మ పాల్గొన్నారు.

➡ ఎస్సీ వసతి గృహానికి మరమ్మతులు చేయాలి

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహానికి వెంటనే మరమ్మతులు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వస్తావుల అభిలాష్, కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ డిమాండ్ చేశారు. శనివారం వసతి గృహాన్ని వారు సందర్శించి మాట్లాడారు. వెంటనే భవనానికి మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జాని, జిల్లా సమితి సభ్యులు జానీ నాయకులు భగవాన్ ధనుష్ పాల్గొన్నారు